క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ అరికట్ల శివనాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని హైవేలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చయనున్నట్లు పేర్కొన్నారు.

'లోక్ అదాలత్' వాయిదా

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మహా శివరాత్రి పండగ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ. తాషిద్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

16న లోక్ అదాలత్

గురజాల : జాతీయ మోగా లోక్ అదాలత్ మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదవ అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు గుర్తించి, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు వాహనాల వేలం

గురజాల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు సీఐ బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని, రిజిస్ట్రేషన్ ఖర్చులు వేలంపాట దారుడు చెల్లించాలని, మరింత సమాచారానికి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లించండి

గురజాల: నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు పన్ను బకాయిలు చెల్లించి, దాని వడ్డీ మాఫీ పొందాలని నగర పంచాయతీ కమిషనర్ ఎ.మోహన్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు సేవాలాల్ మహారాజ్ విగ్రహావిష్కరణ


పిడుగురాళ్ల: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ సమీపంలోని రెడ్డి పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు 6వ వార్డు కౌన్సిలర్ అజ్మీరా శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఏబీఎస్ఎస్ యూత్ ప్రెసిడెంట్ రాంబాబు నాయక్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ట్యాంటర్‌తో తాగునీటి సరఫరా



మాచవరం: చెన్నాయపాలెం గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో గ్రామస్తులకు నీటి సమస్య ఏర్పడింది. గత పది రోజులుగా బోర్ల నుంచి బురదతో కూడిన నీరు రావడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో.. ఆయన వెంటనే స్పందించి, రూ.2లక్షలు విలువ చేసే వాటర్ ట్యాంకర్‌ను గ్రామానికి అందించారు. ఈ ట్యాంకర్ ద్వారా ప్రతి ఇంటికీ నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. స్థానిక నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



దుర్గి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కృషి చేస్తున్నట్లు దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ అన్నారు. శనివారం యాదవుల బజారులో నూతన బోరు బావి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా ప్రజలకు అవసరమైన బోర్లను ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే పీఆర్కే ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ మాణిక్యం, జెడ్పీటీసీ యలమంద, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

అలజడులు సృష్టిస్తే సహించం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కొప్పునూరు గ్రామంలో దెబ్బతిన్న వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి, పీవీఆర్

మాచర్ల రూరల్: ప్రశాంతంగా ఉన్న పల్నాడు ప్రాంతంలో అలజడులు, అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఫ్యాక్షన్ ను ప్రేరేపించి.. ఎన్నికల్లో లబ్ధి పొందాలనే చంద్రబాబు, ఆయన ఏజెంట్ బ్రహ్మానందరెడ్డి విధ్వసంక చర్యలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి కొప్పునూరులో ధ్వంసమైన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. వరుసగా ఐదుసార్లు ఎన్నికల్లో ఓటమి చెందుతూ.. ప్రజల మద్దతు పొందలేక వర్గాలు, గ్రూపులు రాజేస్తూ లబ్ధి పొందాలనే టీడీపీ నాయకుల దుష్ట పన్నాగాలను ఈ ప్రాంత ప్రజలు తిప్పికొడతారన్నారు. ఎన్నికల్లో గెలవలేక 13 సంవత్సరాలు నియోజకవర్గానికి దూరంగా ఉంటున్న బ్రహ్మానందరెడ్డిని ప్యాకేజీ ఇచ్చి ఇన్‌చార్జిగా నియమించటంతో గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు మొదలయ్యాయని పిన్నెల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న మంచికల్లు, నిన్న ముస్లింల మధ్య, నేడు కొప్పునూరు గ్రామంలో చిచ్చు పెడుతూ ఫ్యాక్షన్ దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. అరాచక శక్తులపై తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండి, ప్రజలతో మమేకమై మళ్లీ పల్నాటి ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చలమారెడ్డి, శ్రీనివాసరావు, కిషోర్, రఘురామిరెడ్డి, తాడి వెంకటేశ్వరరెడ్డి, కోటిరెడ్డి, కృష్ణ, జయప్రకాష్‌రెడ్డి, వెంకట్రామయ్య, హనిమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో వైఎస్సార్ సీపీ నేతల ఆందోళన

కారెంపూడి: కొప్పునూరులో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని టీడీపీ పార్టీ నాయకులు ధ్వంసం చేసిన దుశ్చర్యను నిరసిస్తూ కారెంపూడిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నాగులేరు బ్రిడ్జి శనివారం సాయంత్రం బైఠాయించి ఆందోళన చేశారు. చంద్రబాబుకు, బ్రహ్మారెడ్డి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి దిష్టబొమ్మలను దహనం చేశారు. శాంతియుతంగా ఉన్న పల్నాడులో బ్రహ్మారెడ్డి వచ్చిన దగ్గర నుంచి గొడవలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రి, పార్టీ మండలాధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కారెంపూడిలో చంద్రబాబు, బ్రహ్మారెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రతి చిన్నారికి పల్స్ పోలియో



సంజీవరెడ్డినగర్‌లో ర్యాలీ



కారెంపూడిలో అవగాహన ర్యాలీ



పల్స్ పోలియో ర్యాలీ

గురజాల : మండలంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యులు ఎల్. పద్మావతి, బిందు మాధవి, బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాల సీహెచ్‌సీ పరిధిలో 2,182 మంది చిన్నారులకు పది కేంద్రాలు ఏర్పాటు చేసి, ఒక మెబైల్ వాహనం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మాడుగుల పీహెచ్‌సీ పరిధిలో 2,150 మంది చిన్నారులు ఉన్నారని, 17 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అవగాహన ర్యాలీ

కారెంపూడి: తప్పనిసరిగా ఐదేళ్ల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.రమ్య కోరారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నేపథ్యంలో శనివారం పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులతో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో 0- 5ఏళ్లలోపు చిన్నారులు 3,606 మంది ఉన్నారని తెలిపారు. డాక్టర్ కె.మౌనిక, సూపర్‌వైజర్ మల్లయ్య వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పిడుగురాళ్ల: సంజీవరెడ్డినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు నవ్వులూరి అమరేశ్వరరెడ్డి శనివారం పల్స్ పోలీయో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం పరిధిలో 10 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, వార్డు హెల్త్ సెక్రటరీలు సీతామహాలక్ష్మి, స్వర్ణలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని కేంద్రాల్లో పల్స్‌పోలియో

మాచర్ల: పట్టణంలో 34 కేంద్రాల్లో ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు ఆదివారం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, పల్స్ పోలియో పర్యవేక్షణ వైద్యాధికారి శివలీల అన్నారు. 6,208 చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పలువురు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకముందు వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

ఏం చేశారని దాచేపల్లికి వస్తున్నారు

దాచేపల్లి: గతంలో ముఖ్యమంత్రి హోదాలో దాచేపల్లికి వచ్చిన సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు అమలు చేయలేదని, ఇప్పుడెందుకు వస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి ప్రశ్నించారు. నారాయణపురంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రమాదకరంగా ఉన్న కాటేరు వాగును రూ.10 కోట్లతో అధునీకరిస్తామని చెప్పిన చంద్రబాబు ఆ మాటను విస్మరించారన్నారు. ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డి కాటేరు వాగును ఆధునీకరించి, దాచేపల్లికి వరద ముప్పును తప్పించారని తెలిపారు. టీడీపీ నేతలు చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు విశ్వసించటంలేదని, మళ్లీ జగనన్నకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విజయపురిసౌత్: స్థానిక సాగర్ క్యాంప్ కాలనీలో ఆనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ మాచర్ల మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కాలనీకి చెందిన సోరాడ మురళి, బత్తెన కాశీరావు కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన ఒక్కొక్కరికి రూ.10వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు కారే ముసలయ్య, పూరి, మల్లి శ్రీను ఉన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మాచర్ల: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, నిరంతర ప్రార్థనతో స్వస్థత లభిస్తుందని పాస్టర్ ప్రభు కిరణ్ పేర్కొన్నారు. కోనేరు పండగ సందర్భంగా పరిశుద్ధ ఆత్మాభిషేకం శనివారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలను వివరించి, ప్రతి ఒక్కరూ ఏసు కరుణకు పాత్రులు కావాలని కోరారు.

8న కల్యాణ మహోత్సవం

వినుకొండ(నూజెండ్ల): వితంరాజుపల్లి సమీపంలో గల సాయి బృందావనంలో శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పూజ్యశ్రీ హిమాలయ గురువుజీ తెలిపారు. ఈ సందర్భంగా మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం హిమాలయ గురువు మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున గణపతిపూజ, రుద్రాభి షేకం, విశేష అలంకరణ, కుంకుమపూజ, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, మహాపూర్ణాహుతి, కల్యాణం, అఘోర భస్మపూజ, లింగోద్భవ, చండీప్రదక్షిణ, అన్నాభిషేకం తదితరులు పూజలు నిర్వహించనున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో జట్టి శ్రీనివాసరావు, పెండేల సురేష్, బ్రహ్మం, కాశీ, పెండేల బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలి

- అప్పుడే పట్టణ సుందరీకరణ సాధ్యం
- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: ప్రతీ ఒక్క సెక్రటరీ ప్రతిరోజూ వార్డులో పర్యటిస్తూ చెత్త, డ్రెయిన్లు, నూతన నిర్మాణాలతో పాటు ప్రతి సమస్యను పరిశీలించి, వార్డు ప్రజల ద్వారా తెలుసుకునీ రిజిస్టర్‌లో నమోదుచేసి వెంటనే పరిష్కరించటం ప్రథమ బాధ్యతగా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవించంద్రారెడ్డి పేర్కొన్నారు. అప్పుడే పట్టణ సుందరీకరణ సాధ్యమౌతుందన్నారు. శనివారం వార్డు శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీ సెక్రెటరీలతో మున్సిపల్ బంగ్లాలో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్య ఇది మా సమస్య కాదని, వేరే సెక్రటరీ క్లియర్ చేస్తారని చెప్పకుండా సచివాలయంలో తోటి సెక్రటరీలతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలన్నారు.

నూతన భవన నిర్మా ణం జరిగేటప్పుడు ప్లానింగ్ సెక్రటరీ వాటి యజమానులకు డ్రైన్స్‌పై ఎటువంటి నిర్మాణ మెటీరియల్ పడకుండా బండలు వేసుకోవాలని, అదేవిధంగా ర్యాంప్‌లు కట్టేటప్పుడు డ్రైన్లులో పూడిక తీసేందుకు అనువుగా మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించాలన్నారు. శానిటేషన్ సెక్రటరీ ప్రతిరోజు వార్డులో తిరిగేటప్పుడు డ్రైన్లులో ఎక్కడైనా మురుగు ఆగి ఉందా, ఆగితే అడ్డంకిగా ఏమున్నాయో నోట్ చేసుకొని వర్కర్స్ ద్వారా వాటి అన్నింటిని క్లియర్ చేయించాలన్నారు. వార్డు ఏమినిటీ సెక్రటరీలు తమ వార్డులో ఎక్కడైతే డ్రాయింగ్స్ సక్రమంగా లేవో, డ్రెయిన్లు డ్యామేజీ అయితే వాటిని నోట్ చేసుకొని సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కి నివేదించాలని, వాటికి సంబంధించిన నూతన డ్రెయిన్లు నిర్మాణ పనులకు అంచనాలు వేసి వాటి స్థానంలో నూతన నిర్మాణం చేయడం జరుగుతుందని తెలియజేశారు. వార్డులు సుందరంగా ఉండటంలో సెక్రటరీల పాత్ర ముఖ్యమైనదని కావున ప్రతి ఒక్కరూ తమ సొంత బాధ్యతగా తీసుకుంటే ఈ నగరాన్ని మరింత సుందరవనంగా తీర్చిదిద్దుకోవచ్చని తెలియజేశారు. పట్టణ ప్రజలు కూడా పురపాలక సంఘానికి సహకరిస్తూ తమ భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు మీరే స్వతహాగా ఇలాంటివి ఏర్పాటు చేసుకున్నట్లయితే మరింత సులువుగా సమస్యను పరిష్కరించే విధంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట కోటయ్య, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లు రాము నాయక్, స్వర్ణ రాజు పాల్గొన్నారు.

సమైక్యలతో ప్రకృతి వ్యవసాయాన్ని నిర్వహించాలి



ఈపూరు: మండల కేంద్రంలో మండల సమై క్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రంగారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి మండల సమైక్యలు ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా బాధ్యతలు తీసుకోవడం జరుగుతుందన్నా రు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయం మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా వ్యాపించేందుకు దోహదపడుతుందని సూచించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సైదయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసా యం చేయడం ద్వారా విషరహిత ఆహారం లభించడంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. పెరటి తోట లు పెంచడం ద్వారా కుటుంబం ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. కార్యక్రమంలో సీసీలు సుబ్బారావు, రామారావు, రాజు, హనుమంతరావు, గిరి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ తిరుపతిరావు, భాస్కర్ రావు, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మ నాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఏబీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలు ప్రకృతి సాగువైపు మళ్లాలి

ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం అమలకుమారి

యడ్లపాడు: ఇకపై స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా డీపీఎం కె.అమలకుమారి చెప్పారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సమాఖ్య ప్రతినిధులకు, పొదుపు సంఘాల లీడర్లకు ప్రకృతి వ్యవసాయ విధాలనాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ప్రకృతి సేద్యంతోనే సాధ్యమన్నారు. పురుగు మందులు లేని ఆరోగ్యం, ఆనందం పంచే నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి చేయవచ్చన్నారు. తద్వారా భూసారం కూడా దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్ని అమలు చేసేందుకు సమాఖ్య ప్రతినిధులు తీర్మానించడంతో అందరూ ఆమోదించారు. ఏడీపీఎం వంగూరి ప్రేమరాజు, ఏపీఎం జీవన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్ సెల్వీ, కార్యదర్శి ఏ శ్రీలక్ష్మి, కోశాధికారి థామసమ్మ, వివిధ గ్రామాల సంఘాలకు చెందిన లీడర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మానిటరింగ్ కమిటీలు

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: పట్టణంలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనకు మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై సమాచారమందించేందుకు మరొక కమిటీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వాటర్ సప్‌ప్లై పంపు హౌస్‌కు సంబంధించి 98499 07933, ఏఈ ఆదిత్య 90325 88590, లైటింగ్ డీఈఈ ఒ.మధుసూదన రావు 98499 06598, శానిటేషన్, విద్యా సాగర్ 99856 46746, పబ్లిక్ హెల్త్ ఏఈ పి.గౌతమ్ 82971 74325కు నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



నగదు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలోని పేదలను ఆదుకుని, వారి వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద కోట్ల రూపాయలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో పది మంది అనారోగ్య బాధితులకు రూ.10.54లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యశ్రీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధితులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, ఎంపీపీలు సావిత్రి అల్లయ్య, బూడిద మంగమ్మ ఉన్నారు.

శివరాత్రి, సాగరమాత ఉత్సవాలకు బస్సు సర్వీసులు



ఆర్టీసీ డీఎం ఆర్.పిచ్చయ్య

మాచర్ల: నియోజక వర్గ పరిధిలోని జరిగే మహా శివరాత్రి, సాగర్‌మాత తిరునాళ్లకు మొత్తం 58 ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ డీఎం ఆర్.పిచ్చయ్య తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మార్చి 8న మహా శివరాత్రికి శ్రీశైలం 8, సత్రశాల 32, ధైద 2, తేరాల 1, మన్నేపల్లికి ఒక బస్సును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతేడాది లాగానే సత్రశాలకు రూ.40లు చార్జీ వసులు చేస్తున్నామని, అదనపు చార్జీలు లేవని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలకు పాత చార్జీలతోనే సర్వీసులు తిప్పబడతాయని డీఎం చెప్పారు. మార్చి 7న సాగర్ మాత తిరునాళ్లకు 35 బస్సులు, మార్చి 8న 15, మార్చి 9న 35 సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. మాచర్ల నుంచి సాగర్‌కు రూ. 40 మాత్రమే చార్జి వేయటం జరుగుతుందన్నారు.

బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

అచ్చంపేట: బాలికలకు రక్షణ కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో బేటి బచావో- బేటి పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో కె.స్వర్ణకుమారి అధ్యక్షతన శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. బాలికలపై జరిగే అకృత్యాల నుంచి విముక్తి పొందేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా వారి జీవితాల్లో విషాదం చోటు చేసుకుంటుందన్నారు. లింగ నిర్ధారణకు స్వస్తి పలకాలని, నవతరానికి నాంది పలకాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా బాగా చదివించాలన్నారు. పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, అచ్చంపేట, క్రోసూరు ఎంపీపీలు భూక్యా రజనీకృష్ణానాయక్, పేరుమామిళ్ల కోటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలగఫూర్, తహసీల్దారు సువర్ణ, ఎంఈవోలు రాజకుమారి, నరసింహారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాసవీమాత ఆలయ వార్షికోత్సవాలు



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం 28వ వార్షిక మహోత్సవాలు శనివారం ముగిశాయి.ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు చేపట్టిన అమ్మవారి నామ సంకీర్తన ఏకాహ కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, 108 కలశాలతో క్షీర గ్రామోత్సవం, సామూహిక కుంకు మార్చనలు, కలశ క్షీరాభిషేకం, విశేష పూజలు ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారి జెండా ప్రతిష్టాపక చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి అన్నవరపు సతీరామస్వామి పట్టువస్త్రాలు బహూకరించారు. అన్నదాన సమారాధన చేపట్టారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు సూరె వెంకట మణికంఠ, అనుముల శేషగిరి, సూరే వెంకట సుబ్బారావు, రామలింగస్వామి పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఆర్బీకేల్లో కంది పంటకు సరైన మద్దతు ధర

- మార్కెట్ ధరకే కంది కొనుగోళ్లు
- జిల్లా వ్యవసాయాధికారి మురళి



కనపర్రులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

నాదెండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పండిన కంది పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ చెప్పారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.9614.93 పైసలు కాగా, మరో రూ.74.65 పైసలు కూలీ, రవాణా ఖర్చుల నిమిత్తం చెల్లిస్తున్నామన్నారు. మొత్తం మీద క్వింటా ధర రూ.9689.58 పైసలు రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని, రైతులు రబీలో వేసిన పంట ఉత్పత్తులను అమ్ముకోవాలని కోరారు. విత్తన కొనుగోలు నుంచి పంట ఉత్పత్తుల వరకూ మార్కెట్ ధరలకు అమ్ముకునే వెసులుబాటుతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని ఆయన వివరించారు. అనంతరం రబీ సీజన్‌లో వేసిన పంటల వివరాలతో పొందుపరచిన సామాజిక తనిఖీ రిపోర్టును ఆయన పరిశీలించారు. కొద్దిసేపు స్థానిక రైతులతో మాట్లాడారు. సామాజిక తనిఖీలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ నెల 5వ తేదీ లోగా రాతపూర్వకంగా ఫిర్యా దు చేసుకోవచ్చన్నారు. ఆయనతో పాటూ జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ రవికుమార్, స్థానిక వ్యవ సాయాధికారి ఎ.హరిప్రసాద్, వీహెచ్ఏ రామాంజమ్మ ఉన్నారు.

20 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోళ్లు

శావల్యాపురం: ప్రభుత్వ ఆదేశాలు మేరకు కందులు క్వింటా మద్దతు ధర 9680 రూపాయలకు రైతు భరోసా కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ శనివారం తెలిపారు. కంది పంట సాగు చేసిన దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన రెండు రోజుల వ్యవధిలో రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గత వారం రోజుల నుంచి 20 మెట్రిక్ టన్నులు కందులు రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రైతులకు గోనె సంచులు, కూలీ, రవాణ ఖర్చు అంతా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. చివరి గింజ వరకు కంది పంటను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు.